సాక్షి
అన్నమయ్య జిల్లా
ఆదివారం | 12 | మే | 2024



నేను లోకల్.. గెస్ట్ పొలిటిషియన్ కాదు
ప్రజలతో పాటు పార్టీ క్యాడర్‌కు అండగా ఉంటాను అని రాజంపేట వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి పి.వి.మిథున్‌రెడ్డి అన్నారు. - 8లో



వైఎస్సార్‌సీపీలో చేరిక
రైల్వేకోడూరు మండలంలో టీడీపీ, జనసేనకు చెందిన వంద కుటుంబాల వారు ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. - 8లో



పసికందు గొంతు నులిమేశాడు
చేయి పట్టుకుని నడిపించిన తండ్రి మద్యం మత్తులో అభం శుభం తెలియని ఏడాదిన్నర కొడుకు గొంతు నులిమి కడతేర్చాడు. - 8లో

కూటమితో కాంగ్రెస్ కుమ్మక్కు

- కడప పుత్తా ఎస్టేట్స్‌లో రాహుల్‌గాంధీ బహిరంగసభ
- వైఎస్సార్‌సీపీ ఓట్లు చీల్చడమే కాంగ్రెస్ ఏకైక ఎజెండా
- ముస్లిం మైనార్టీ అభ్యర్థుల ఎంపికకు అదే సంకేతం
- తద్వారా టీడీపీకి సాయం చేయాలనే లక్ష్యం



సాక్షి ప్రతినిధి, కడప: తెలుగుదేశం పార్టీతో కాంగ్రెస్ పార్టీ మిలాఖత్ అయింది. నోటా కంటే తక్కువ ఓట్లు వచ్చిన పార్టీకి అధ్యక్షురాలిగా షర్మిల నియామకం పొందినప్పటినుంచి అందరికీ అనుమానం ఉండేది. దాన్ని రుజువు చేస్తూ కాంగ్రెస్ అడుగులు పడుతున్నాయి. వైఎస్సార్‌సీపీ ఓట్లు చీల్చడమే ఏకైక ఎజెండాగా ఆ పార్టీ వ్యవహరిస్తోంది. సంప్రదాయ ఓట్లకు గండి కొట్టాలనే ఎత్తుగడను అవలంబిస్తోంది. అందులో భాగంగా ముస్లిం మైనార్టీల ఓట్లు చీల్చడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఆ మేరకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలకు తెలుగుదేశం పార్టీ కూడా సహకరిస్తోంది. ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ రాహుల్‌గాంధీ బహిరంగసభ టీడీపీ నేత పుత్తా నరసింహారెడ్డి ఎస్టేట్స్‌లో నిర్వహించడం అందుకు ఉదాహరణగా నిలుస్తోంది.

- జిల్లాలో వైఎస్ కుటుంబం అన్నా, వైఎస్సార్‌సీపీ అన్నా పార్టీలకు అతీతంగా ముస్లిం మైనార్టీలు అండగా నిలుస్తున్నారు. అనేక ఎన్నికలు ఆ విషయాన్ని స్పష్టం చేశాయి. ఇప్పటికే కడపలో రెండు పర్యాయాలు వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఎస్‌బి అంజద్‌బాషా విజయం సాధించారు. ఈమారు విజయాన్ని అడ్డుకోవాలని టీడీపీ విశ్వప్రయత్నం చేస్తోంది. అందుకు కాంగ్రెస్ సహకారం తీసుకుంది. ఓవైపు టీడీపీ విద్వేషాలు రెచ్చగొడుతూ కుట్ర రాజకీయాలు చేస్తుండగా, మరోవైపు కాంగ్రెస్‌తో చేతులు కలిపింది. గణనీయమైన మద్దతుగా ఉన్న ముస్లీం మైనార్టీ ఓట్లు చీల్చడమే లక్ష్యంగా ఎత్తుగడలు వేశారు. వైఎస్సార్‌సీపీ నేత అఫ్జల్‌ఖాన్‌ను రాత్రికి రాత్రే కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా ఎంపిక చేశారు. ముస్లిం మైనార్టీల్లో పఠాన్ సామాజిక వర్గీయుల మద్దతు దక్కించుకోవాలనే దురుద్దేశం అందులో దాగి ఉన్నట్లు విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. అందుకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి ఆర్థిక సహకారం అందించేందుకు ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం.

ముస్లిం మైనార్టీ ఓటర్లలో చీలికలు తీసుకువస్తే...

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లిం మైనార్టీలకు 4శాతం రిజర్వేషన్లు కల్పించారు. వెనుకబాటు తనంలో ఉన్న ముస్లింల జీవితాల్లో సామాజిక మార్పు వచ్చింది. తద్వారా వైఎస్ కుటుంబానికి ముస్లింలు అండగా ఉంటున్నారు. వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలుస్తున్న ఆ వర్గం ఓట్లలో చీలికలు తీసుకువచ్చేందుకు టీడీపీ ప్రణాళికలు అమలు చేసింది. తద్వారా టీడీపీ అభ్యర్థులకు ప్రయోజనం చేకూర్చే చర్యలకు పూనుకుంది. కడప, ప్రొద్దుటూరు, రాయచోటి నియోజకవర్గాలలో ఇదే పంథాను కాంగ్రెస్ ఎంచుకుంది. టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి డైరెక్షన్‌లో కాంగ్రెస్‌పార్టీ యాక్షన్ చేస్తోంది. రహస్య ఎజెండా మేరకు ఎవరి పాత్ర వారు సమర్థవంతంగా నిర్వహిస్తూ వైఎస్సార్‌సీపీ సంప్రదాయ ఓట్లకు గండి కొట్టే ఎత్తుగడలు వేస్తున్నారని విశ్లేషకులు సైతం వెల్లడిస్తున్నారు.

టీడీపీ-కాంగ్రెస్ మధ్య పరస్పర సహకారం...

కాంగ్రెస్‌పార్టీకి టీడీపీ సైతం బాహాటంగా సహకరిస్తోంది. మాజీ మంత్రి వైఎస్ వివేకా కేసులో అసంబద్ధ వ్యాఖ్యలు చేయవద్దని, విచారణ కోర్టులో ఉన్న నేపథ్యంలో ఇష్టానుసారం మాట్లాడవద్దని జిల్లా కోర్టు భావించింది. మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఉత్తర్వులను వెకేట్ చేయాలంటూ షర్మిల, సునీతలతో పాటు పులివెందుల టీడీపీ అభ్యర్థి బీటెక్ రవి కూడా హైకోర్టును ఆశ్రయించారు. తదపరి జిల్లా కోర్టుకు తప్పుడు ఫిర్యాదు చేయడంతో ముగ్గురికి రూ.10వేలు చొప్పున రూ.30వేలు జరిమానా కూడా జిల్లా కోర్టు విధించింది. అదిఅటుంచితే ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలు అనేకం ఉన్నా, కమలాపురం టీడీపీ నేత పుత్తా నరసింహారెడ్డి స్థలంలో రాహుల్‌గాంధీ బహిరంగ సభ నిర్వహించడం గమనార్హం.



ఇడుపులపాయ సందర్శన ఎన్నికల ఎత్తుగడే

డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి హోదాలో దివంగతులై దాదాపు 15ఏళ్లు కావస్తోంది. కాంగ్రెస్ పార్టీని రాష్ట్రంలో, కేంద్రంలో అధికారంలోకి తీసుకురావడంలో వైఎస్సార్ పాత్ర అప్పట్లో అత్యంత కీలకం. అలాంటి వ్యక్తి అర్ధంతరంగా మృతి చెందితే, ఇడుపులపాయ ఘాట్‌కు సోనియాగాంధీ కుటుంబం రాలేదు. 15 సంవత్సరాల తర్వాత రాహుల్‌గాంధీ రావడం విశేషం. ఈ పర్యటన కేవలం ఎన్నికల ప్రచార ఎత్తుగడగా స్పష్టమవుతోంది. వైఎస్సార్ ఘాట్‌లో రాహుల్‌గాంధీ పట్టుమని 10 నిమిషాలున్నారు. వైఎస్సార్ మరణాన్ని తట్టుకోలేక ఉమ్మడి రాష్ట్రంలో దాదాపు 600 మంది మృతి చెందారు. వారి మృతికి చిహ్నంగా ఘాట్‌లో స్థూపాన్ని ఏర్పాటు చేశారు. వైఎస్సార్ పట్ల చిత్తశుద్ధి ఉంటే ఆ స్థూపాన్ని కూడా సందర్శించేవారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



ప్రచారం.. పరిసమాప్తం!

- పార్టీల ప్రచారానికి ఫుల్‌స్టాప్
- నెలన్నర రోజులకుపైగా అభ్యర్థుల విస్తృత ప్రచారాలు
- ఇప్పటికే ఓటర్లకు టీడీపీ ప్రలోభాలు
- జిల్లాలో సీఎం వైఎస్ జగన్ సభలకు పోటెత్తిన ప్రజలు
- చంద్రబాబు డ్రామాలతో జిల్లాలో విశ్వసనీయత కోల్పోయిన కూటమి
- కొత్త ఉత్సాహంలో దూసుకుపోతున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు



సాక్షి రాయచోటి: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నెలన్నర రోజులుగా జరుగుతున్న ప్రచారానికి శనివారం సాయంత్రం 6.00 గంటలకు ఫుల్‌స్టాప్ పడింది. ఎడతెరిపి లేకుండా పగలనక.. రాత్రనక.....ఎండనక.. గాలనక.. అన్ని పార్టీల నేతలు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. మార్చి 16వ తేదీన కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిన నాటి నుంచి నేటి వరకు నేతలంతా ఉరుకులు, పరుగులతో ప్రచారాన్ని ముమ్మరంగా సాగించారు. ఎప్పుడూ లేనంతగా నేతలంతా పల్లె, పట్టణాలు, వాడలు అనే తేడా లేకుండా విస్తృతంగా కలియ తిరిగారు. ఎట్టకేలకు గడువు ముగియడంతో ప్రచారానికి తెర పడింది. సోమవారం పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ఇప్పటికే అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఒకవైపు పోలీసులు.. మరోవైపు పోలింగ్ అధికారులు చేస్తున్న ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి.

సీఎం వైఎస్ జగన్ విస్తృత ప్రచారం

అన్నమయ్య జిల్లాలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పలు నియోజకవర్గాల్లో ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహించారు. అందుకు సంబంధించి ఏప్రిల్, మే నెలల్లో సిద్ధం, మేమంతా సిద్ధం సభల్లో భాగంగా మదనపల్లె, పీలేరు, రాజంపేట నియోజకవర్గాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఎక్కడ చూసినా జనం ఆయనకు బ్రహ్మరథం పడుతూ వచ్చారు. సభల్లో ఆయన ప్రసంగాలకు ప్రజల నుంచి విపరీతమైన మద్దతు లభించింది. ఒకవైపు కార్యకర్తలను కార్యోన్ముఖులను చేస్తూ.. ఐదేళ్లలో చేసిన అభివృద్ధి, ఇంటింటికి అందించిన సంక్షేమాన్ని వివరిస్తూ సీఎం పర్యటన సాగింది. బస్సు యాత్రలో భాగంగా పట్టణాలు, పల్లెల ప్రజలను పలకరిస్తూ పథకాల కొనసాగింపునకు ఎన్నికల్లో తమకు మద్దతు తెలియజేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరారు.

విశ్వాసం కోల్పోయిన కూటమి

టీడీపీ అధినేత చంద్రబాబు జిల్లాలోని పీలేరు, మదనపల్లె, రాజంపేట, రాయచోటిలలో పర్యటించినా స్పందన అంతంతమాత్రంగానే కనిపించింది. పైగా ఆయన జిల్లా కేంద్రానికి సంబంధించిన వ్యవహారంపై ఎక్కడికక్కడ రాజకీయ లబ్ధి కోసం మాట్లాడిన మాటలు కూటమిపై ప్రజల్లో విశ్వాసం కోల్పోయేలా చేసింది. పైగా బీజేపీ అభ్యర్థిగా నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి పోటీ చేస్తున్న రాయచోటి, మదనపల్లె, పీలేరులలో ముస్లిం మైనార్టీ వర్గాలు ఉన్న ప్రాంతంలో ప్రచారం నిర్వహించే సమయంలో ఎమ్మెల్యే అభ్యర్థికి ఓటు వేయాలని అభ్యర్థించారే తప్ప బీజేపీ ఎంపీ అభ్యర్థికి ఓటు వేయాలని కోరలేని పరిస్థితి కనిపించింది.

ప్రలోభాలకు తెరలేపిన టీడీపీ

పోలింగ్ సమయం దగ్గర పడేకొద్ది టీడీపీ తెరవెనుక మంత్రాంగాలకు తెరలేపింది. ఎక్కడికక్కడ నియోజకవర్గాల్లో ఓటర్లకు ప్రలోభాలు పెడుతున్నారు. ఓటుకు నోటుతో ఏదో ఒక రకంగా రాజకీయ ప్రయోజనాలు పొందేందుకు ఆపసోపాలు పడుతోంది. ఇప్పటికే వర్గ విభేదాలతో కుదేలైన టీడీపీ ఎన్నికల్లో ఏదో ఒక రకంగా లబ్ధి పొందాలన్న ఆలోచనతో కుయుక్తులు చేస్తోంది

ముగిసిన ప్రచారం

అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా అభ్యర్థుల ప్రచారం శనివారం సాయంత్రంతో ముగిసింది. ప్రధానంగా వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు జోరుగా ప్రచారం నిర్వహించారు. అంతకుముందు అనేక కార్యక్రమాలతో అనునిత్యం ప్రజల్లోనే గడిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొనగా, పోలింగ్‌కు సైనికుల్లా కదులుతున్నారు. ఇక అందరి దృష్టి పోలింగ్‌పై నిమగ్నమైంది.

పుష్పగిరిలో కనుల పండువగా కల్యాణోత్సవాలు

వల్లూరు: పవిత్ర పుణ్య క్షేత్రమైన పుష్పగిరి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి, శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వాముల కల్యాణోత్సవాలు కనుల పండువగా జరిగాయి. క్షేత్రాధిపతియైన పరమ శివుని అంశలోని వైద్యనాథస్వామి కల్యాణంతో పాటు క్షేత్ర పాలకుడైన విష్ణు అంశలోని చెన్నకేశవ స్వామి కల్యాణ మహోత్సవం ఒకే రోజు జరగడం ఇక్కడ విశేషంగా చెప్పవచ్చు. ఉదయం శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని కల్యాణ వేదికపై శ్రీ కామాక్షీ వైద్యనాథుల కల్యాణ మహోత్సవాన్ని వేద పండితుల ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణలతో, మంగళ వాయిద్యాల నడుమ అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. శాస్త్రోక్తంగా కల్యాణ క్రతువును జరిపారు. ఈ కల్యాణ మహోత్సవాన్ని తిలకించిన భక్తులు భక్తి పారవశ్యంతో మునిగి పోయారు. కల్యాణం అనంతరం నంద్యాల హరికృష్ణ, చింతలపత్తూరు అవధానం చెంచు సుబ్రమణ్యం ఆధ్వర్యంలో అన్నదానాన్ని నిర్వహించారు.

- రాత్రి కొండపై చెన్నకేశవ స్వామి ఆలయ ప్రాంగణంలోని మంటపంలో ఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితులు అఖిల్ దీక్షితులు ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవిలతో శ్రీ చెన్నకేశవుని కల్యాణం వైభవోపేతంగా జరిగింది. అలంకార భూషితులైన శ్రీదేవి ,భూదేవిలు చెన్నకేశవ స్వామితో కలిసి అందంగా అలంకరించబడిన వేదికపై ఆశీనులయ్యారు. వేద పండితులు మొదట విశ్వక్సేన పూజ ,పుణ్యాహవచనం, మహా సంకల్పం నిర్వహించారు. అనంతరం మంగళ వాయిద్యాల నడుమ వేద మంత్రాల సాక్షిగా యజ్ఞోపవీత ధారణ, కంకణ ధారణ, జీలకర్ర బెల్లం ధారణ జరిగింది. కన్యాదాన కార్యక్రమం అనంతరం మంగళసూత్ర ధారణ నిర్వహించారు. అనంతరం జరిగిన ముత్యాల తలంబ్రాల కార్యక్రమం కల్యాణ మహోత్సవంలో ప్రత్యేకత సంతరించుకుంది. ఈ సందర్భంగా కొండ ప్రాంతమంతా లక్ష్మీ చెన్నకేశవ నామ స్మరణతో మార్మోగింది. అనంతరం శ్రీ కామాక్షీ వైద్యనాథ స్వామికి, శ్రీ చెన్నకేశవ స్వామికి గజవాహన సేవను నిర్వహించారు.


గరుడ వాహనంపై శ్రీ చెన్నకేశవ స్వామి

గరుడ వాహనంపై ఊరేగిన చెన్నకేశవుడు

కాగా శుక్రవారం తెల్లవారుజామున శ్రీచెన్నకేశవ స్వామి తనకు అత్యంత ప్రీతి పాత్రమైన గరుడ వాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామంలోకి వస్తున్న స్వామిని చూసేందుకు, పల్లకిని మోసేందుకు భక్తులు పోటీలు పడ్డారు.

నేడు రథోత్సవాలు: బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం 10 గంటలకు శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి రథోత్సవం జరుగుతుంది. మధ్యాహ్నం 4. 30 గంటలకు శ్రీ లక్ష్మీ చెన్నకేశవుల రథోత్సవం జరుగుతుంది.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు పక్కాగా ఉండాలి

జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్

రాయచోటి/మదనపల్లె/గుర్రంకొండ/కురబలకోట: అన్నమయ్య జిల్లాలోని పోలింగ్ కేంద్రాలలో సౌకర్యాలు పక్కాగా ఉండాలని జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం ఆయన రాయచోటి పట్టణంలోని నూరాని మసీదు వీధి, గుర్రంకొండ మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలు, మదనపల్లి పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్, ఈశ్వరమ్మకాలనీలోని పోలింగ్ కేంద్రాలను, కురబలకోట మండలం మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 1609 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు పోలింగ్ కేంద్రాలలో కనీస సౌకర్యాలు ర్యాంపు, తాగునీరు, ఫర్నిచర్, విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్, లైటింగ్ తదితర వసతులు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఓటర్లకు ఇబ్బందులు లేకుండా బారికేడింగ్ పటిష్టంగా ఉండాలన్నారు. విభిన్న ప్రతిభావంతులు వంద శాతం ఓటు హక్కును వినియోగించుకొనేలా పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపు, వీల్ చైర్స్‌తో పాటుగా బీఎల్‌ఓ, వీఆర్‌ఏను వారికి సహాయకులుగా అందుబాటులో ఉంచాలన్నారు. ఓటర్లు, ఏజెంట్లు, అభ్యర్థులు మొబైల్ ఫోన్స్, ఐ పాడ్, టాబ్స్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు పోలింగ్ కేంద్రంలోనికి తీసుకువెళ్లేందుకు అనుమతిలేదన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్న విషయం ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో వీడియో కవరేజ్, మరియు వెబ్ క్యాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. విద్యుత్ అంతరాయం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి ఆర్డీఓ రంగస్వామి, మదనపల్లి ఆర్డీఓ హరిప్రసాద్, మదనపల్లి మున్సిపల్ కమిషనర్ ప్రమీల, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.


రాయచోటిలో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

జిల్లాలో సెక్షన్ 144 అమలు

జిల్లాలో ఈనెల 11వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి జూన్ 6వ తేదీ వరకు సెక్షన్ 144 అమలులో ఉంటుందని జిల్లా మెజిస్ట్రేట్, కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభకు అలాగే లోక్ సభకు సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో శాంతిభద్రతలను పరిరక్షించేందుకు ఎన్నికల నిర్వహణలో అవాంఛనీయ సంఘటనలను నివారించేందుకు ఈ సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. ఈ నిబంధనలు పాటించని వ్యక్తులు ఐపీసీ సెక్షన్ 188 కింద శిక్షార్హులు అవుతారని హెచ్చరించారు.

న్యూస్‌రీల్

పోలింగ్ స్టేషన్‌లను పరిశీలించిన జేసీ


కలికిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

కలికిరి: కలికిరి పరిధిలోని పోలింగ్ స్టేషన్‌లను శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ పరిశీలించారు. కలికిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలింగ్ బూత్‌లు 189, 190, 191, ఎంపీపీ మెయిన్ పాఠశాలలోని 200, 201, 202 పోలింగ్ స్టేషన్‌లను తనిఖీ చేశారు. పోలింగ్ బూత్‌లలోని ఏర్పాట్లతో పాటు విద్యుత్ సరఫరా, సీసీ కెమెరాల పనితీరు, టాయిలెట్లు తదితర మౌలిక వసతులను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ విజయకుమారి, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

నేడు ఆదిశంకరాచార్యుల జయంతి

కడప కల్చరల్: జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతిని ఆదివారం స్థానిక ఆకులవీధి శ్రీ రాజరాజేశ్వరీ ఆలయప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు శ్రీ బిట్రా పట్టాభిరామయ్య భగవద్గీత సత్సంగం అధ్యక్షులు సుబ్బారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం పుష్పార్చన, సాయంత్రం 7.00 నుంచి ప్రముఖ ఆధ్యాత్మికవేత్తల ఉపన్యాసాలు ఉంటాయన్నారు.


కరువు నేలలో జలధారలు

- కృష్ణా జలాలతో అన్నమయ్య జిల్లా సస్యశ్యామలం
- రూ.4,373.23 కోట్లతో ఎత్తిపోతల పథకం నిర్మాణ పనులు
- రూ.1,100 కోట్లతో వెలిగల్లు వరకు పనులు పూర్తి
- ఏడాదిలోగా రాయచోటికి నీటిని అందించేలా చర్యలు
- లక్షల ఎకరాలకు సాగు నీరు

రాయచోటి: నిత్యం కరువు కాటకాలకు నిలయంగా ఉన్న అన్నమయ్య జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు జగనన్న ప్రభుత్వం చేపట్టిన గాలేరు-నగరి, హంద్రీనీవా ప్రాజెక్టుల అనుసంధాన పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. శతాబ్దాలుగా వర్షాధారంగా జీవనం సాగిస్తున్న జిల్లా కరువు రైతాంగానికి జగనన్న ప్రభుత్వంలో ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డిల పట్టుదల, కృషి ఫలితంగా సుదూరంలో ఉన్న కృష్ణా జలాలు అన్నమయ్య జిల్లాలో పరుగులు తీయనున్నాయి. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ద్వారా నాటి కడప జిల్లా(నేటి అన్నమయ్య జిల్లా) లోని రాయచోటి, చిత్తూరు జిల్లాలోని తంబళ్లపల్లి, మదనపల్లి, పీలేరు, పలమనేరు, కుప్పం ప్రాంతాలకు కృష్ణా జలాలను అందించేందుకు కాలువలను తవ్వించారు. అయితే అనంతపురం జిల్లాలోని రిజర్వాయర్లు, చెరువులను నింపుకొని ఈ ప్రాంతాలకు కృష్ణాజలాలు రావడం కష్టతరమైంది. దీంతో కరువు ప్రాంత రైతులు కృష్ణా జలాలపై ఆశలు వదులుకున్నారు. ఇలాంటి తరుణంలో వైఎస్ఆర్ జిల్లా ఎంపీ అవినాష్ రెడ్డితో కలిసి ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి లు గండికోట నుంచి ఎత్తిపోతల ద్వారా గాలేరు నగరి - హంద్రీనీవా అనుసంధానంతో ఈ ప్రాంతాలను సస్యశ్యామలం చేయవచ్చని ప్రణాళికలను రూపొందించారు. ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ పథకం ఏర్పాటు వలన పులివెందుల నియోజకవర్గంలోని కరువు ప్రాంతంగా పేరొందిన వేంపల్లి, చక్రాయపేట మండలాలకు కూడా తాగునీరు పుష్కలంగా అందుతుందని వివరించారు. ఫలితంగా ముఖ్యమంత్రి పథకం నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో అన్నమయ్య జిల్లా రైతులలో ఆవిరైన కృష్ణా జలాల ఆశలు తిరిగి చిగురించాయి. వెంటనే ప్రభుత్వం అనుమతులు ఇవ్వడంతో పాటు నిధుల మంజూరుకు గ్రీన్ సిగ్నల్ లభించింది. 2021 జూలై 4న ములకలచెరువు మండలం నాయనచెరువుపల్లె వద్ద పనులకు శ్రీకారం చుట్టారు. ఈ పథకానికి ప్రభుత్వం రూ.5,030 కోట్లు మంజూరు చేయగా టెండర్ల ద్వారా రూ.4,373.23కోట్లతో పనులు కాంట్రాక్టర్‌కు అప్పగించారు. ఈ అనుసంధాన పనులు పూర్తయితే హంద్రీనీవా ప్రాజెక్టు ఉపకాలువలు, ప్రధాన కాలువ, ప్రధాన రిజర్వాయర్లకు కృష్ణా జలాలు పుష్కలంగా చేరుతాయి. తద్వారా అన్నమయ్య జిల్లా పరిధిలోని రాయచోటి, తంబళ్లపల్లి, పీలేరు, మదనపల్లి నియోజకవర్గాల్లోని చెరువులను నీటితో నింపే కార్యక్రమం పూర్తవుతుంది.


పూర్తయిన కాలేటివాగు రిజర్వాయర్

ప్రాజెక్టు పూర్తికి సీఎం సహకారం



ప్రాజెక్టుల అనుసంధానం పనులు సత్వరమే పూర్తయ్యేలా కృషి చేస్తున్నాం. పనులు పూర్తయ్యాక రాయచోటి నియోజకవర్గానికి తాగునీటి సమస్య పూర్తిగా తీరుతుంది. రైతాంగానికి సాగునీరు అందుతుంది. నియోజకవర్గంలో పైప్‌లైన్ పనులు, రిజర్వాయర్ల సామర్థ్యం పెంపు పనులు పూర్తయ్యాయి. ఈ ప్రాజెక్టుతో జిల్లా మొత్తం సస్యశ్యామలం అవుతుంది.
–గడికోట శ్రీకాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే

ఎంపీ, ఎమ్మెల్యేల ప్రత్యేక దృష్టి

జీఎన్‌ఎస్‌ఎస్- హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఎత్తిపోతల పథకంగా పిలవబడే ఈ పథకం ద్వారా గండికోట రిజర్వాయర్ నుంచి కృష్ణా జలాలను వినియోగించుకునే లక్ష్యంగా పథకాన్ని రూపొందించారు. ఈ పథకం ద్వారా వైఎస్సార్ జిల్లా చక్రాయపేట మండలం కాలేటి వాగు రిజర్వాయర్‌ను 1.5 టీఎంసీల సామర్థ్యంతో నీటిని నింపేలా నిర్మిస్తున్నారు. ఈ రిజర్వాయర్ నుంచి అన్నమయ్య జిల్లా రాయచోటి సమీపంలోని వెలిగల్లు ప్రాజెక్టుకు ప్రధాన పైప్ లైనును ఏర్పాటు చేస్తున్నారు. మరో పైపులైన్ కాలేటి వాగు నుంచి లక్కిరెడ్డిపల్లి మండలం ఎర్రగుడి సమీపంలోని చెరువుకు నీటిని అందించే ఎత్తిపోతల పథకం పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. ఎంపీలు వైఎస్ అవినాష్ రెడ్డి, పీవీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డిలు ఎప్పటికప్పుడు ఈ ప్రాజెక్టు నిర్మాణంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

రూ.300 కోట్లతో కాలేటివాగు పనులు..

చక్రాయపేట మండలంలోని కాలేటి వాగు రిజర్వాయర్ నిర్మాణ పనులకు 300 కోట్ల రూపాయలు ప్రభుత్వం కేటాయించింది. జీఎన్‌ఎస్‌ఎస్ కెనాల్ ద్వారా వేంపల్లి మండలం పాములూరు గ్రామం వద్ద నుంచి ఎత్తిపోతల ద్వారా ఈ రిజర్వాయర్‌కు నీటిని అందిస్తారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే చక్రాయపేట మండలంతో పాటు లక్కిరెడ్డిపల్లి, రామాపురం మండలాలకు అదనపు పైపులైన్ ద్వారా 130 చెరువులను కృష్ణా జలాలతో నింపి తద్వారా భూగర్భ జలాలను పెంచే కార్యక్రమానికి ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేసింది. ఈ నీటి ద్వారా 2500 ఎకరాలకు సాగునీరు అందనుంది. కాలేటివాగు నుంచి కల్లూరుపల్లె రిజర్వాయర్‌కు, ఇక్కడి నుంచి 1,550 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోతల ద్వారా వెలిగల్లు రిజర్వాయర్‌కు తరలిస్తారు.

తీరనున్న తాగునీటి సమస్య

వెలిగల్లు ప్రాజెక్టుకు అనుసంధానంగా కొత్తగా నిర్మించిన కల్లూరివారిపల్లె రిజర్వాయర్ కూడా పూర్తయింది. ఈ పథకం ద్వారా మొత్తం 20 టీఎంసీల నీటిని 120 రోజుల్లో తరలించేలా రూపొందించారు. ఇందులో 13 టీఎంసీలు ఉమ్మడి చిత్తూరు జిల్లాకు దక్కుతాయి. ఈ నీటిని అడవిపల్లె రిజర్వాయర్‌తో పాటు ఉమ్మడి అన్నమయ్య జిల్లాలోని శ్రీనివాసపురం, ఝరికోన రిజర్వాయర్లకు తరలిస్తారు. వీటికింద ఆయకట్టును స్థిరీకరిస్తారు. రాయచోటి నియోజకవర్గంలోని 125 చెరువులకు నీటిని తరలించి నింపుతారు. వెలిగల్లు ప్రాజెక్టుకు నీటి కరువు ఏర్పడితే 2 టీఎంసీల నీటిని తరలిస్తారు. ఈ పథకం పూర్తయితే అన్నమయ్య జిల్లా పరిధిలో ఉన్న రాయచోటి ప్రజలకు తాగునీటి కష్టాలు తీరుతాయి, భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయి. ప్రాజెక్టుల అనుసంధాన పనులు పూర్తి కాగానే తంబళ్లపల్లె నియోజకవర్గంలోని చెరువులకు కృష్ణా జలాలను తరలించనున్నారు. నియోజకవర్గంలోని శ్రీనివాసపురం, ఝరికోన రిజర్వాయర్లను నింపి తద్వారా నియోజకవర్గంలోని అన్ని మండలాల పరిధిలోని చెరువులను సంపూర్ణంగా నింపేలా ప్రణాళికలు సిద్ధం చేశారు.


కాలేటివాగు వద్ద ఎత్తిపోతల పథకం పనులు

క్లుప్తంగా

ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్

వేంపల్లె : ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపుల పాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు ఆర్వీ అసోసియేట్స్ గ్లోబల్ సివిల్ ఇంజినీరింగ్ సంస్థ ఇంటర్న్ షిప్‌కు ఒప్పందం కుదుర్చుకున్నట్లు డైరెక్టర్ కుమారస్వామి గుప్తా తెలిపారు. ఆ సంస్థ తిరుపతిలోని ఐటీలో నిర్వహించిన సమావేశానికి ఆర్జీయూకేటీ ఛాన్సలర్ ప్రొ.కె.చెంచురెడ్డి, వైస్ ఛాన్సలర్ ప్రొ.విజయకుమార్ హాజరయ్యారు. తొలి విడతలో భాగంగా ట్రిపుల్‌ఐటీ సివిల్ ఇంజినీరింగ్‌కు చెందిన 12 మంది విద్యార్థులకు నెలకు రూ.10 వేల చొప్పున వేతనం లభిస్తుందన్నారు. విద్యార్థులు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఐటీ డైరెక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

పులివెందుల విద్యార్థికి గేట్‌లో ఉత్తమ ర్యాంకు


జయరమేష్

పులివెందుల : పులివెందుల పట్టణానికి చెందిన దాసరి ఈశ్వరయ్య, ఆదిలక్ష్మి దంపతుల కుమారుడు జయరమేష్ ఇటీవల నిర్వహించిన గేట్ పరీక్షలో ఆల్ ఇండియా స్థాయి 59వ ర్యాంకు సాధించాడు. దీంతో బెంగుళూరులో జయరమేష్‌కు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ నిర్వహించిన ఇంటర్వ్యూలో ఉత్తీర్ణత సాధించి ఎంటెక్ బయో ఇంజినీరింగ్ సీటు సాధించారు. జయరమేష్ ఇటీవలే బీటెక్ ఎన్ఐటీ వరంగల్‌లో నాల్గవ సంవత్సరం పూర్తి చేశాడు. ర్యాంకు రావడం పట్ల ఆయన తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మాజీ సర్పంచ్‌కు గాయాలు


నాగరాజు (ఫైల్)

బి.కొత్తకోట : వైఎస్సార్ సీపీ నాయకుడు ,బి.కొత్తకోట మాజీ సర్పంచు ఇసరయ్యగారి నాగరాజు శుక్రవారం రాత్రి జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ జాఫర్‌బాషాతో కలిసి బైక్‌పై శంకరాపురం నుంచి బి.కొత్తకోటకు వస్తుండగా మార్గ మధ్యంలో బైక్ అదుపుతప్పి కింద పడింది. దీనితో నాగరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా కాలి ఎముక విరిగిందని గుర్తించిన వైద్యులు శనివారం శస్త్ర చికిత్స చేశారు.

నేను లోకల్.. గెస్ట్ పొలిటిషియన్ కాదు

- ప్రజలకు ఏ అవసరమున్నా.. నేను ముందుంటా
- రాష్ట్రంలో మళ్లీ ఫ్యాన్ ప్రభంజనం
- జగన్ ఆశయాలకు అనుగుణంగా ముందుకెళ్తా
- సంక్షేమం, అభివృద్ధినే ప్రజలు చూస్తారు
- ప్రజలే నా బలం



కొత్తగా అన్నమయ్య జిల్లా ఆవిర్భవించిన తర్వాత జరుగుతున్న తొలి సార్వత్రిక ఎన్నికలు ఇవి. సిట్టింగ్ ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి ముచ్చటగా మూడోసారి వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నారు. మాజీ ముఖ్యమంత్రి, రాష్ట్ర విభజనకు కారకుడు నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి బీజేపీ అభ్యర్థిగా ఈయనపై పోటీలో ఉన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి పీవీ మిథున్ రెడ్డి చేసిన అభివృద్ధి, ఆయన విజయావకాశాలు తదితర అంశాలపై ఆయనతో జరిపిన ఇంటర్వ్యూ విశేషాలు.. – రాజంపేట

సాక్షి ఇంటర్వ్యూ

? : మీరు రాజంపేట స్థానం నుంచి ఎన్నోసారి పోటీ చేస్తున్నారు. మీ బలం ఏమిటి?

■ మిథున్‌రెడ్డి : రాజంపేట నుంచి మూడోసారి పోటీ చేస్తున్నాను. ప్రజలతో పాటు పార్టీ క్యాడర్‌కు అండగా ఉంటా. పిలిస్తే పలుకుతా..చెబితే చేస్తాను. రెండుసార్లు రాజంపేట లోక్‌సభ ప్రజలు ఆశీర్వదించారు. మూడోసారి ఆశీర్వదిస్తే లోక్‌సభ నియోజకవర్గం అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషిచేస్తాను. ప్రజల అండదండలతో ఈ ఎన్నికల్లో ముందుకెళుతున్నాను.

? : మీ ప్రత్యర్థి, మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డికి, మీకు ఉన్న తేడా ఏమిటి

■ నేను లోకల్ లీడర్, కిరణ్‌కుమార్‌రెడ్డి గెస్ట్ పొలిటీషియన్. వస్తాడు. పనిచేసుకుంటాడు. హైదరాబాదుకు వెళ్లిపోతాడు. ఇది లోక్‌సభ పరిధిలోని ప్రజలందరికీ తెలుసు. ఇప్పుడు మళ్లీ సూట్‌కేసుతో హైదరాబాదుకు పంపించేందుకు జనం సిద్ధంగా ఉన్నారు.

? : మీకున్న బలం ఏమిటి? ఏ విధంగా ఈ ఎన్నికల్లో గెలుస్తారని భావిస్తున్నారు

■ నాకున్న బలం ప్రజలు. జగనన్న ఆశయాలతో ముందుకెళుతున్నాను. ఈ ఎన్నికల్లో ఓటర్లు సంక్షేమం, అభివృద్ధినే చూస్తారు. మళ్లీ ఫ్యాన్ ప్రభంజనమే. జగనన్న ఎన్నికల సభలకు జనం బ్రహ్మరథం పట్టారు. అందుకే కూటమిలో ఓటమి గుబులు పట్టుకుంది.

? : రాజంపేట లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఏ విధంగా అభివృద్ధి చేశారు. వచ్చే టర్మ్‌లో ఏం చేయనున్నారు

■ రూ.2400 కోట్లతో వాటర్‌గ్రిడ్స్ పూర్తి చేశాము. హంద్రీనీవా, గాలేరు–నగరి ప్రాజెక్టులను ముందుకు నడిపిస్తున్నాము. కడప–రేణిగుంట జాతీయ రహదారి నిర్మాణానికి ప్రాధాన్యత ఇచ్చాను. రాయచోటి, పుంగనూరు, రైల్వేకోడూరు, పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె, రాజంపేట ప్రాంతాల్లో అభివృద్ధిని పరుగులు తీయించాము. అన్ని నియోజకవర్గాలలో ఆ ప్రాంత పరిస్థితులను బట్టి అభివృద్ధి చేస్తున్నాం. రాజంపేట పార్లమెంటరీ నియోజకవర్గాన్ని దేశంలోనే ఆదర్శ పార్లమెంటరీ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలన్నదే నా సంకల్పం. తప్పకుండా దేవుడు, ప్రజల ఆశీస్సులతో నా సంకల్పం సిద్ధిస్తుందని ఆశిస్తున్నాను.

? : రాజంపేట లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో రైల్వే సమస్యల పరిష్కారానికి ఏ విధంగా కృషి చేశారు

■ ప్రధానంగా రైల్వేపరంగా ప్రసిద్ధి చెందిన నందలూరు రైల్వేకేంద్రంలో నూతన రన్నింగ్‌రూం మంజూరుకు కృషి చేశాను. బడ్జెట్‌లో కూడా ప్రకటించారు. రైల్వే పూర్వవైభవం కోసం ప్రత్యామ్నాయ పరిశ్రమ ఏర్పాటు చేయాలని లోక్‌సభలో కూడా ప్రస్తావించాను. ఎప్పటికప్పుడు నందలూరు రైల్వే అభివృద్ధి కోసం రైల్వేమంత్రి, రైల్వేబోర్డుకు వినతులు ఇస్తూనే ఉన్నాము. ఎన్నడూ లేని విధంగా ముంబై–రేణిగుంట రైలు మార్గంలోని రాజంపేట లోక్‌సభ పరిధిలో ఉన్న రైల్వే ప్రాంతాల్లో గేట్ల సమస్య లేకుండా ఆర్‌యూబీ(రోడ్ అండర్ బ్రిడ్జి)ల మంజూరుకు కృషి చేశాము. ఇప్పుడు పనులు జరుగుతున్నాయి. రాజంపేట, పీలేరు రైల్వేస్టేషన్లను అమృత్‌లో ఎంపికకు కృషి చేశాను. అలాగే కరోనా ముందు ఏ విధంగా హాల్టింగ్ సౌకర్యం ఉండేదో అదే విధంగా ఉండేలా రైల్వే మంత్రిత్వశాఖ దృష్టికి తీసుకెళ్లాను.

? : జిల్లాకు సంబంధించిన అంశంపై చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు సాధ్యమయ్యేవేనా

■ చంద్రబాబు రాజంపేటకు వస్తే ఒక మాట.. రాయచోటికి వెళితే మరొక మాట, మదనపల్లెలో ఉంటే ఇంకో మాట ఇలా జనం చెవిలో పువ్వులు పెడతారు. అవి సాధ్యం కావని ప్రజలకు తెలుసు. బాబు మాటలను నమ్మే పరిస్థితిలో రాజంపేట జనం లేరు. ఊసరవెల్లి రాజకీయాలకు రాజంపేట ప్రజలు చెల్లుచీటి పలుకుతారు. మేము వచ్చే టర్మ్‌లో అన్నమయ్య ప్రాజెక్టును పూర్తి చేయిస్తాము. 18వ మెడికల్ కాలేజి రాజంపేటలో ఏర్పాటు చేస్తామని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు.

? : రాజంపేట వైఎస్సార్‌సీపీ లోక్‌సభ అభ్యర్థిగా విజయావకాశాలు ఏ విధంగా ఉన్నాయి

■ కచ్చితంగా జగనన్న సంక్షేమం, అభివృద్ధి నన్ను గెలిపిస్తాయి. దళితులు, ముస్లింలు, క్రైస్తవులు, బీసీల ఆశీర్వాదాలు నాకు పుష్కలంగా ఉన్నాయి. ముస్లిం మైనార్టీలకు సీఎం వైఎస్ జగన్ అంటే అభిమానం, ఆత్మీయత ఉంది. పెద్దిరెడ్డి కుటుంబం పేదల పక్షాన నిలుస్తుందని అన్నమయ్య, చిత్తూరు జిల్లా వాసులందరికి తెలుసు. ఏ అవసరం ఉన్నా..నేనున్నా అంటూ ముందుకొచ్చే కుటుంబం ఏది అంటే పెద్దిరెడ్డి కుటుంబమే. దైవబలం, ప్రజాబలంతో అఖండ విజయం సాధిస్తానన్న నమ్మకం ఉంది.

అభివృద్ధి చేశా.. ఆశీర్వదించండి

- పేదల ఉసురు టీడీపీకి తగులుతుంది
- పేద విద్యార్థులకు సాయం అందుకుండా చేశారు
- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి


మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

రాయచోటి : రాయచోటిని అన్ని రంగాలలో అభివృద్ధి చేశా.. నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసం నిత్యం కృషి చేశాను.. ఈ ఎన్నికలలో నాకు ఓటు వేసి ఆశీర్వదించండి, మరింత అభివృద్ధి చేస్తా అని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు.రాయచోటి పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే మీడియాతో శనివారం మాట్లాడుతూ రాయచోటిని జిల్లా కేంద్రంగా చేశబూమన్నారు. కరోనా విపత్కర పరిస్థితులలో ప్రజల ప్రాణాలను కాపాడేందుకు తాము పడిన శ్రమను ప్రజలు కళ్లారా చూశారన్నారు. ప్రత్యేక ఆసుపత్రి ఏర్పాటు, ఆక్సిజన్ సిలిండర్లు సిద్ధ చేయడం, సొంత డబ్బుతో ఆయుర్వేద మందులు అందివ్వడం చేశామన్నారు. జిల్లా కేంద్రం ఏర్పాటుతో అన్ని రంగాలలో అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయించామన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మహిళలకు, రైతులకు, విద్యార్థులకు, కార్మికులు, అన్ని రంగాల వారికి తోడుగా నిలిచామన్నారు. రాయచోటిని స్పెషల్ గ్రేడ్ వన్ మున్సిపాలిటీగా చేశామని వివరించారు. రాజంపేట, మదనపల్లిలో పోటీ చేసే అభ్యర్థులు వాటిని జిల్లా కేంద్రంగా మారుస్తామని మాయ మాటలు చెబుతున్నారన్నారు. ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రజలే వివరించి చెప్పడం సంతృప్తినిచ్చిందన్నారు.

పేదల ఉసురు టీడీపీకి తగులుతుంది

రాష్ట్రంలో పేదలు, విద్యార్థులు, మహిళలకు చేయూత, ఆసరా, ఇతరులకు సబ్సిడీ అందనీయకుండా చేసిన టీడీపీకి వారి ఉసురు తగులుతుందని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్లలో పేద ప్రజలు ఆఫీసుల చుట్టూ తిరగకుండా, లంచాలకు తావు లేకుండా నేరుగా వారి ఖాతాలకు డబ్బు జమ చేశామన్నారు. ఈ ఏడాది ప్రజలకు అందాల్సిన డబ్బులు విడుదల కాకుండా కోర్టులో పిటిషన్ వేసి టీడీపీ వారు అడ్డుకోవడం హేయమైన చర్యగా అభివర్ణించారు. ఎవరు అభివృద్ధి చేశారో..వారినే ఎన్నుకోవాలని అన్నారు.ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, జిల్లా మైనార్టీ యువజన విభాగం అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్, పలువురు కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన సార్వత్రిక ఎన్నికల ప్రచారం

- కొత్త వ్యక్తులు నియోజకవర్గాల నుంచి వెళ్లిపోవాలి
- పోలింగ్ ప్రారంభానికి ముందే ఏజెంట్లు కేంద్రాలలో ఉండాలి
- జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ఎం.అభిషిక్త్‌కిషోర్


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి అభిషిక్త్‌కిషోర్, పక్కన ఎస్పీ కృష్ణారావు

రాయచోటి : ఎన్నికల నిబంధనల ప్రకారం పోలింగ్ తేదీకి 48 గంటల ముందే ప్రచారం ముగిసిందని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ఎం.అభిషిక్త్ కిషోర్ తెలిపారు. రాయచోటి కలెక్టరేట్‌లో జిల్లా ఎస్పీ బి.కృష్ణారావుతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్లు మినహా... రాజకీయ ప్రచారాల నిమిత్తం వచ్చిన బయటి ప్రాంతాల నుంచి వచ్చిన వారంతా వెళ్లిపోవాలన్నారు. ఐదు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమికూడితే 144 సెక్షన్ కింద నేరంగా పరిగణిస్తామన్నారు. మే 13న ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు.ఆదివారం సాయంత్రానికి సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకుంటారని తెలిపారు. జిల్లాలో మొత్తం 1609 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. జిల్లాలో మూడు నియోజకవర్గాలలో పూర్తిగా, మిగిలిన వాటిలో 50 శాతం మేర వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు ఉంటుందన్నారు. పోలింగ్ రోజున కంట్రోల్ రూమ్ ద్వారా పోలింగ్ సరళి పర్యవేక్షిస్తామని పేర్కొన్నారు. 270 కేంద్రాలలో వీడియోగ్రఫీ ఉంటుందని పేర్కొన్నారు. ఓటర్ల సౌకర్యం నిమిత్తం 800 వీల్ చైర్స్ సిద్ధం చేశామన్నారు. సుమారు 20 వేల మంది ఉద్యోగులు భాగస్వామ్యం వహిస్తున్నారని చెప్పారు. 13న ఉదయం పోలింగ్ ప్రారంభానికి ముందే ఏజెంట్లు కేంద్రాలలో ఉండాలన్నారు. ఒక పార్టీ ఏజెంట్ మరొక పార్టీ ఏజెంట్‌ను ఇబ్బందులకు గురి చేయడం, అడ్డుకోవడం చేయరాదన్నారు. మే 13న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల లోపు ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో డీఆర్‌ఓ సత్యనారాయణ రావు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నరసింహకుమార్ పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే చర్యలు : జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు

ఎన్నికల సందర్భంగా ఎవరైనా అల్లర్లు చేయడం, గొడవలు సృష్టించడం, శాంతి భద్రతలకు విఘాతం కలిగించడం చేస్తే కఠినచర్యలు తప్పవని జిల్లా ఎస్పీ బి.క్రిష్ణారావు హెచ్చరించారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాలు గుర్తుంచుకొని క్రమశిక్షణతో ఉండాలన్నారు. ఎన్నికల యంత్రాంగంతో సమన్వయంగాఉంటూ ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తున్నామని ఎస్పీ చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 11 కంపెనీల సీఏపీఎఫ్, ఒక కంపెనీ ఏపీఎస్పీ బలగాలు జిల్లాకు కేటాయించారన్నారు. వీటితో పాటు కర్ణాటక, తమిళనాడు నుంచి అదనంగా పోలీసు బలగాలు వచ్చాయని వివరించారు. స్ట్రాంగ్ రూములు, రూట్ మొబైల్స్, ఇంటర్మీడియట్ స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

వంద కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక


ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు సమక్షంలో పార్టీలో చేరిన టీడీపీకి చెందిన కుటుంబాలు


వైఎస్సార్‌సీపీలోకి చేరిన ఆర్.సి.వడ్డిపల్లె గ్రామస్తులు

రైల్వేకోడూరు అర్బన్ : ఎన్నికల సమయంలోనే కాకుండా ఎల్లవేళలా ప్రజలతో మమేకమవ్వడమే తన అభిమతమని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సేవకుడిలా పని చేస్తానని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. రైల్వేకోడూరు మండలం మైసూరువారిపల్లె, మాధవరం పోడు, కె.బుడుగుంటపల్లె పంచాయతీల్లో టీడీపీ, జనసేనకు చెందిన వంద కుటుంబాలు శనివారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి ప్రభుత్వ విప్ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ చంద్రబాబు కల్లబొల్లి మాటలతో ప్రజలను మోసగించడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. వాలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేసి అవినీతి రహిత పాలన అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రైల్వేకోడూరులో ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిలకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, రామిరెడ్డి ధ్వజారెడ్డి, దార్ల చంద్రశేఖర్, యజ్జం చంద్రశేఖర్, ఆర్‌సి.సురేష్‌బాబు, చలపతి, సాదు పవన్, కొండూరు లోకేష్, కారుమంచి మహీంద్రా, బీదం వెంకటేష్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి చేరిక

మదనపల్లె : మండలంలోని దుబ్బిగానిపల్లె సర్పంచ్ బుడ్డయ్య ఆధ్వర్యంలో ఆర్.సి.వడ్డిపల్లెకు చెందిన శ్రీరాములు, మహేష్, లోకేష్, నాగరాజు, సంజీవ్, మారెప్ప, రాణి, మంగమ్మ, గీత, రెడ్డెమ్మ, వెంకటరమణ, రెడ్డి, రామయ్యతోపాటు 15 కుటుంబాలు శనివారం వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్ అహ్మద్ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. జగనన్న పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం చూసి వైఎస్సార్‌సీపీలో చేరినట్లు సి.వడ్డిపల్లె వాసులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సుధాకర్, చంద్రారెడ్డి, వెంకటప్ప, రామకృష్ణ, వెంకటాచలపతి, తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం వద్ద ఉద్రిక్తత

– అరగంటకే స్టాకు ఖతం.. తిరగబడిన మద్యం ప్రియులు


గుర్రంకొండలోని మద్యం దుకాణం వద్ద పరిస్థితి

గుర్రంకొండ : గుర్రంకొండలోని మద్యం దుకానం వద్ద శనివారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. దుకాణం తెరిచిన అరగంటకే దుస్టాకు లేదని సేల్స్‌మెన్ ప్రకటించారు. దీంతో ఆగ్రహించిన మద్యం ప్రియులు తిరగబడ్డారు. వివరాలిలా ఉన్నాయి. స్థానిక మద్యం దుకాణం శనివారం ఉదయం 10 గంటలకు తెరిచారు. అప్పటికే పెద్ద ఎత్తున మద్యంప్రియులు వేచి ఉన్నారు. రెండురోజుల పాటు దుకాణం మూతపడనుండడంతో మద్యం సీసాల కోసం ఎగబడ్డారు. దీంతో అరగంటకే మద్యం లేదంటూ సేల్స్‌మెన్‌లు ప్రకటించారు.ఆగ్రహించిన మద్యం ప్రియులు దుకాణ ఎదుట హంగామా చేస్తూ తిరగబడ్డారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు చేరుకుని వివరాలు ఆరా తీశారు. గత వారం రోజులుగా సేల్స్‌మెన్‌లు మద్యం బ్లాక్‌లొ విక్రయిస్తున్నారని స్థానికులు ఆరోపించారు. పోలీసులు మద్యం ప్రియులను చెదరగొట్టారు.

పసికందు గొంతు నులిమేశాడు

– కన్న కొడుకుని కడతేర్చిన కసాయి తండ్రి


మృతి చెందిన బాలుడు

వేంపల్లె : చేయి పట్టుకుని నడిపించిన తండ్రి... కంటికి రెప్పలా చూసుకోవాల్సిన ఆయనే మద్యం మత్తులో అభం శుభం తెలియని ఏడాదిన్నర కొడుకు గొంతు నులిమి కడతేర్చాడు. ఈ విషాద ఘటన వైఎస్సార్ జిల్లా వేంపల్లెలోని రాజీవ్ కాలనీలో శనివారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అన్నమయ్య జిల్లాలోని రెడ్డివారిపల్లె గ్రామానికి చెందిన సంధ్యకు ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన సురేష్‌తో నాలుగు సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి కుమారుడు శ్రీనివాసులు(2) సంతానం. వారిరువురూ వేంపల్లె రాజీవ్ కాలనీలో నివాసముంటూ ఇద్దరూ కూలి పని చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో శనివారం మద్యం మత్తులో సురేష్ విచక్షణ కోల్పోయి కొడుకు శ్రీనివాసులు(2) గొంతు నులిమాడు. సురేష్ తల్లి కేకలు వేయడంతో స్థానికులు హుటాహుటిన అక్కడికి చేరుకొని చిన్నారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. సంధ్య పుట్టుకతోనే మూగి కావడంతో సురేష్ ఆమెపై నింద వేయాలని చూశాడు. పోలీసులు మందలించడంతో తాగుడుకు తాగిన మత్తులోనే కొడుకును చంపినట్లు పోలీసులకు తెలిపారు. దీంతో సురేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. కుమారుడి మృతితో తల్లి విలపించడం స్థానికులను కలచివేసింది. సురేష్ తల్లి ఫిర్యాదు మేరకు వేంపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు

ఆర్టీసీ బస్సు ఢీ

– గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం

మదనపల్లె : ఆర్టీసీ బస్సు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం పాలైన సంఘటన శనివారం రాత్రి మదనపల్లె పట్టణంలో జరిగింది. స్థానిక సంత గేటు వద్ద గుర్తుతెలియని వ్యక్తి (44), రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా, వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. కింద పడిన గుర్తుతెలియని వ్యక్తి తలపై నుంచి ఆర్టీసీ బస్సు వెళ్లడంతో అతను అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. ముఖం ఛిద్రం కావడంతో గుర్తించటానికి వీలు లేకుండా పోయింది.క్షణాల్లో జరిగిన సంఘటన నుంచి స్థానికులు తేరుకునే లోపే ఆర్టీసీ బస్సు అక్కడి నుంచి వెళ్లిపోయింది. వెంటనే స్థానికులు టూ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ వెంకటసుబ్బయ్య ప్రమాద వివరాలు స్థానికులను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడు నల్లటి జీన్స్ ప్యాంట్, నిలువు చారలు కలిగిన బ్లూ ఫుల్ షర్ట్ ధరించి ఉన్నాడు.

చంద్రబాబు మాటలు నమ్మొద్దు

వేంపల్లె : ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో విశ్వసనీయతకు పట్టం కట్టాలని, చంద్రబాబు మాయ మాటలు నమ్మవద్దని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కోరారు. వేంపల్లి–పులివెందుల రోడ్డు నుంచి ప్రధాన కూడళ్లలో శనివారం ఆయన రోడ్‌షో నిర్వహించారు. అడుగడుగునా ప్రజలు నీరాజనాలు పలుకుతూ గజమాలలతో ఎంపీ అవినాష్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి దేశంలోనే రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలిపారన్నారు. వేంపల్లె మండలంలో రూ.625కోట్ల అభివృద్ధి జరిగిందని పేర్కొన్నారు. ముస్లిం మైనార్టీ సోదరులకు ఉర్దూ జూనియర్ కళాశాల, రూ.20 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. అప్పట్లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పోతిరెడ్డిపాడు రెగ్యులేటరీ 11 టీఎంసీల నుంచి 44 టీఎంసీల వరకు పెంచకుంటే చుక్క నీరు వచ్చేది కాదన్నారు. జగనన్న ప్రభుత్వం వచ్చాక రూ.240 కోట్లు ఆర్‌ఎన్‌ఆర్ ప్యాకేజీ చెల్లించి సీబీఆర్‌లో 2020 నుంచి క్రమం తప్పకుండా ప్రతి ఏడాది 10 టీఎంసీలు నీరు నిల్వ చేస్తున్నామన్నారు. వేంపల్లి చివరి ఆయకట్టు వరకు సీబీఆర్ పైడిపాలెం పిబిసి ద్వారా నీళ్లు అందిస్తున్నామన్నారు. తెలుగుదేశం పార్టీతో పాటు జనసేన, బీజేపీలను కూటమిగా కలుపుకొని ప్రజలందరినీ మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. చంద్రబాబు ఎల్లో మీడియా ఇచ్చిన స్క్రిప్టును ఈ కాంగ్రెస్ నాయకులు చదువుతూ జగన్‌మోహన్‌రెడ్డి, అవినాష్ రెడ్డిలను ఇష్టం వచ్చినట్టుగా ద్వేషిస్తున్నారు. అక్కచెల్లెమ్మల్లోనూ ద్వేషాన్ని నింపాలని చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సతీష్‌కుమార్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డి, చంద్ర ఓబుల్‌రెడ్డి,లక్ష్మిగాయత్రి, శ్రీనివాసులు, షబ్బీర్‌వల్లి పాల్గొన్నారు.